ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
1
బుధవారం 5 జూన్ 2024



బొంరాస్‌పేట్‌లో మోస్తరు వర్షం

బొంరాస్‌పేట్, జూన్ 4: బొంరాస్‌పేట్ మండలంలో మంగళవారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. మండల కేంద్రంతో పాటు మహంతీపూర్, మెట్లకుంట, తుంకిమెట్ల, నాందర్‌పూర్, ఏర్పుమళ్ల తదితర గ్రామాల్లో వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. వర్షాకాలం ప్రారంభంలో కురిసిన వానతో వ్యవసాయ పనులకు ఊతం కలిగించిదని సంతోషం వ్యక్తం చేశారు.



చేవెళ్ల మండలం గొల్లపల్లిలోని బీఎస్ఐటీ కాలేజీలో ఓట్ల లెక్కింపు

- అధికార పార్టీ కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ
- కొంపముంచిన అభ్యర్థుల ఎంపిక
- బీఆర్ఎస్‌కు తీవ్ర పరాభవం
- ఒక్క ఎమ్మెల్యే లేకున్నా భారీ మెజార్టీ సాధించిన బీజేపీ
- చేవెళ్లలో 2లక్షల మెజార్టీతో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపు
- మల్కాజిగిరిలో 4 లక్షల మెజార్టీతో ఈటల రాజేందర్ విజయం

కమల వికాసం

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ప్రతిష్ఠాత్మకమైన రెండు లోక్‌సభ స్థానాలు చేవెళ్ల, మల్కాజిగిరిలో భారతీయ జనతా పార్టీ విజయ దుందుభి మోగించింది. మే 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడగా ఈ రెండు చోట్లా బీజేపీ అభ్యర్థులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్‌లు భారీ మెజారిటీలతో గెలుపొందారు. రెండు చోట్లా సమీప కాంగ్రెస్ అభ్యర్థులపై వారు విజయం సాధించారు. కాగా చేవెళ్ల, మల్కాజిగిరి స్థానాల్లో బీఆర్ఎస్ మూడో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ రెండు సెగ్మెంట్ల పరిధిలో బీజేపీకి ఒక్క ఎమ్మెల్యే లేకున్నా లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ అనూహ్య విజయాని నమోదు చేసుకుంది.



కాంగ్రెస్ కొంపముంచిన అభ్యర్థుల ఎంపిక

అధికార కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభ ఎన్నికల ఫలితాలు తీవ్ర నిరాశకు గురిచేశాయి. అధికార పార్టీ అభ్యర్థులు బీజేపీ చేతిలో ఘోర పరాజయాన్ని చవిచూశారు. అభ్యర్థుల ఎంపికే దీనికి ప్రధాన కారణం. చేవెళ్ల, మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాల నుంచి పోటీకి కాంగ్రెస్ సీనియర్లు కేఎల్లాఆర్‌తో పాటు మరికొందరు ఆసక్తి చూపినప్పటికీ బీఆర్ఎస్ నుంచి వచ్చిన రంజిత్‌రెడ్డి, సునీతారెడ్డిలకు కాంగ్రెస్ నాయకత్వం టికెట్లు కేటాయించింది. దీన్ని కాంగ్రెస్ ముఖ్య నేతలు కొందరు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ కారణంగా ఎన్నికల సమయంలో వారు అభ్యర్థులకు పూర్తిస్థాయిలో సహకరించలేదు. ఇదిలా ఉంటే తొలుత వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డిని చేవెళ్ల బరిలో దింపాలనే భావించారు. ఈ మేరకు ఆమె ప్రచారాన్ని కూడా మొదలు పెట్టారు. కానీ చివరి క్షణంలో ఆమెను మల్కాజిగిరికి పంపి చేవెళ్ల స్థానాన్ని బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డికి కేటాయించారు. దీని వల్ల కూడా చేవెళ్ల పార్లమెంట్ స్థానాన్ని కాంగ్రెస్ చేతులారా పోగొట్టుకుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. చేవెళ్ల నుంచి సునీతారెడ్డి పోటీ చేసి ఉంటే ఇక్కడ గెలిచే అవకాశాలు మెరుగ్గా ఉండేవి. సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డిపై స్థానికంగా వ్యతిరేకత కూడా ఎక్కువగానే ఉంది. దీంతో పాటు ఆయన బీఆర్ఎస్ ప్రభుత్వంలో కాంగ్రెస్ నేతలపై కేసులు పెట్టి వేధించారనే ఆరోపణలూ ఉన్నాయి. దీంతో కాంగ్రెస్‌లో అనేక మంది నాయకులు, కార్యకర్తలు ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించడమే కాకుండా ఎన్నికల్లో సహాయ నిరాకరణ చేశారు.

ఈటలకు ఈ గెలుపు ప్రత్యేకం

దేశంలోనే అతిపెద్ద నియోజకవర్గమైన మల్కాజిగిరి నుంచి బీజేపీ తరుపున బరిలో దిగిన ఈటల రాజేందర్ ఘన విజయం సాధించారు. ఈ గెలుపు ఈటలకు ప్రత్యేకమనే చెప్పాలి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన ఈటలకు అధిష్ఠానం మల్కాజిగిరి నుంచి పోటీ చేసే అవకాశం కల్పించింది. దీంతో ఇక్కడ గెలుపు ఆయనకు సవాల్‌గా మారింది. అంతేకాదు మల్కాజిగిరి స్థానం సీఎం రేవంత్ రెడ్డి సిట్టింగ్ సీటు కావడం గమనార్హం. అలాగే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ లోక్‌సభ స్థానం పరిధి అసెంబ్లీ సెగ్మెంట్లలో 3లక్షల పైచిలుకు మెజార్టీ సాధించిన బీఆర్ఎస్ కూడా బరిలో ఉంది. దీంతో మల్కాజిగిరి స్థానంలో గెలుపు కోసం ఈటల ఎంతో కష్టపడ్డారు. ముందు నుంచే వ్యూహాత్మకంగా ప్రచారాన్ని మొదలుపెట్టి ఎన్నికల్లో విజయం సాధించారు. ఈ నేపథ్యంలో అన్నీ కలిసివస్తే ఆయనకు కేంద్రంలో లేదా పార్టీలో కీలక పదవులు దక్కే అవశాలు మెరుగుపడ్డాయి.

'కొండా' రెండో సారి గెలుపు

చేవెళ్లలో బీజేపీ తరుపున బరిలో దిగిన కొండా విశ్వేశ్వరెడ్డికి ఈ స్థానం నుంచి రెండో సారి విజయం లభించింది. 2014లో ఆయన టీఆర్ఎస్ నుంచి పోటీచేసి విజయం సాధించారు. ఆ పార్టీ నాయకత్వంతో పొసగక బయటకొచ్చిన ఆయన 2019లో కాంగ్రెస్‌లో చేరి ఆ పార్టీ నుంచి పోటీ చేసి బీఆర్ఎస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి చేతలో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. 2024 ఎన్నికల్లో కొండా.. కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన రంజిత్‌రెడ్డిపై విజయం సాధించి ప్రతీకారం తీర్చుకున్నారు.



వికారాబాద్‌లో బాణసంచా కాలుస్తున్న నాయకులు

చేవెళ్ల, మల్కాజిగిరిలో బీజేపీ ఘన విజయం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

పార్లమెంట్ ఎన్నికల్లో కమలం వికసించింది. చేవెళ్ల, మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ దుమ్మురేపింది. రెండు స్థానాల్లోనూ రికార్డుస్థాయిలో ఓట్లు కొల్లగొట్టి అఖండ విజయాలను నమోదు చేసింది. అధికార కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ప్రధాన ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్‌కు ఈ ఎన్నికలు తీవ్ర నిరాశను మిగిల్చాయి. ఈ పార్లమెంట్ స్థానాల్లో అధిక సంఖ్యలో ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ బీఆర్ఎస్ రెండు స్థానాల్లో మూడోస్థానంలో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల, మల్కాజిగిరి లోక్‌సభ స్థానాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు మంగళవారం జరిగింది. మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతారెడ్డిపై 3,91,475 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు 9,91,042 ఓట్లు లభించగా కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతారెడ్డికి 5,99,567 ఓట్లు వచ్చాయి. అలాగే బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి 3,00,486 ఓట్లు లభించాయి. ఇక చేవెళ్ల లోక్‌సభ స్థానంలో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వరెడ్డి తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిపై దాదాపు 1,72,897 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి విశ్వేశ్వరెడ్డికి 8,09,882 ఓట్లు లభించగా కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి 6,36,985 ఓట్లు వచ్చాయి. అలాగే బీఆర్ఎస్ తరుపున బరిలో దిగిన కాసాని జ్ఞానేశ్వర్‌కు 1,78,968 ఓట్లు లభించాయి. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపొందేందుకు అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు బీఆర్ఎస్, బీజేపీలు తీవ్రంగా శ్రమించాయి. రాష్ట్రంలోనే అత్యంత కీలకమైన చేవెళ్ల, మల్కాజిగిరి స్థానాలపై అందరి దృష్టి నెలకొనడంతో ఈ ఎన్నికలను రాజకీయ పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. దేశంలోనే అతిపెద్ద నియోజకవర్గాలైన చేవెళ్ల, మల్కాజిగిరిలో గెలుపొందేందుకు అన్ని వ్యూహాలను అమలు చేశాయి. మల్కాజిగిరి స్థానం సీఎం రేవంత్‌రెడ్డి సిట్టింగ్ సీటు కావడంతో ఇక్కడ ఎన్నిక ఆసక్తి రేకెత్తించింది. అలాగే చేవెళ్లలో ప్రధాన పార్టీల నుంచి అపర కుబేరులు రంగంలో దిగడంతో ఇక్కడ ఎన్నికల్లో అభ్యర్థులు విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేశారు. అయితే ఈ రెండు స్థానాల్లో చివరకు విజయం భారతీయ జనతా పార్టీ అభ్యర్థులనే వరించింది.

బీఆర్ఎస్ ఓటు బీజేపీకి షిఫ్ట్!

అసెంబ్లీ ఎన్నికల తరువాత ఆరు నెలల వ్యవధిలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు విలక్షణ తీర్పు ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో మూడోస్థానంలో ఉన్న బీజేపీ తక్కువ వ్యవధిలోనే మొదటి స్థానంలో నిలవడమేకాక రికార్డు స్థాయిలో ఓట్లు సాధించింది. దీనికి కారణం ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ చివరి క్షణంలో బీజేపీవైపు మొగ్గుచూపినట్లు స్పష్టమవుతోంది. బీఆర్ఎస్ అధికారం కోల్పోయాక పరిస్థితి రోజురోజుకూ దిగజారుతుండడంతో ఆ పార్టీకి సంబంధించిన ఓటర్లు, అభిమానులు మెజార్టీ సంఖ్యలో బీజేపీ వైపు మొగ్గుచూపారు. దీంతో బీజేపీకి ఈ ఎన్నికల్లో గణనీయంగా ఓట్లు లభించాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో బీఆర్ఎస్‌కు 40.85శాతం ఓట్లు రాగా కాంగ్రెస్ పార్టీకి 35.2శాతం ఓట్లు, బీజేపీకి 19.37 శాతం ఓట్లు వచ్చాయి. అయితే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ తన ఓటు బ్యాంకును కొంత మెరుగుపరుచుకున్నప్పటికీ బీఆర్ఎస్ తన ఓటు బ్యాంకు గణనీయంగా కోల్పోయింది. ఈ ఓట్లన్నీ కూడా బీజేపీకి బదిలీ అయ్యాయి. అలాగే కాంగ్రెస్‌లో అసంతృప్తిగా ఉన్న వారు కూడా బీజేపీవైపు మొగ్గుచూపారు. దీంతో బీజేపీ ఓటు బ్యాంకు

మిగతా 5వ పేజీలో...



ఈటల రాజేందర్‌కు ధ్రువపత్రం అందజేస్తున్న కలెక్టర్ గౌతమ్



కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ధ్రువపత్రం అందజేస్తున్న కలెక్టర్ శశాంక




అన్ని రౌండ్లలో కొండాదే ఆధిక్యం

- 24 రౌండ్లలో ఓట్ల లెక్కింపు

రంగారెడ్డి అర్బన్/ చేవెళ్ల, జూన్ 4 : చేవెళ్ల పార్లమెంట్ ఓట్ల లెక్కింపు ఉత్కంఠ బరితంగా సాగింది. ఉదయం 8గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కించారు. అనంతరం ఈవీఎంల లెక్కిపు కొనసాగింది. చేవెళ్ల పార్లమెంట్‌లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఓట్ల లెక్కింపును రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల కలెక్టర్లు శశాంక, నారాయణరెడ్డిల పర్యవేక్షణలో నిర్వహించారు. ఓట్ల లెక్కింపు రాత్రి 7గంటలకు ముగిసింది. 24 రౌండ్లలో ఓట్లను లెక్కించారు. మొదటి రౌండ్ నుంచి చివరి రౌండ్ వరకు బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రత్యర్థి రంజిత్‌రెడ్డిపై ఆధిక్యాన్ని సాధించారు. చివరకు కొండా 1,72,897 మెజారిటీతో గెలిచారు. మొదటి రౌండ్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు 10,079 ఓట్లు, కొండా

మిగతా 5వ పేజీలో...





అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే
పెరిగిన ఓటు బ్యాంకు

వికారాబాద్, జూన్4 (ఆంధ్రజ్యోతి) చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఘన విజయం సాధించడంతో కాషాయ దళంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలో ఎట్టి పరిస్థితుల్లో విజయం సాధించాలని కాంగ్రెస్, బీజేపీలు హోరాహోరీగా శ్రమించగా, ఓటర్లు బీజేపీకి పట్టంగట్టారు. చేవెళ్ల లోక్‌సభ స్థానాన్ని కైవసం చేసుకోవడం కమల దళంలో కొత్త ఆశలు చిగురించేలా చేసింది. లోక్‌సభ ఎన్నికల్లో సాధించిన విజయంతో రాబోయే మునిసిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీ, పీఏసీఎస్ ఎన్నికల్లోనూ తమ సత్తా చాటుకోవాలని కాషాయ దళం ఇప్పటి నుంచే సంసిద్ధమవుతోంది. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే జిల్లాలో బీజేపీ తన సత్తా చాటుకుంది. జిల్లాలో కొడంగల్, వికారాబాద్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ తన సత్తా చాటుకోగా, పరిగి, తాండూరు నియోజకవర్గాల్లో బీజేపీ మెజార్టీ సాధించింది. గత నవంబర్ నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఆ పార్టీకి ఊహించని విధంగా ఓటు బ్యాంకు పెరిగింది. అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో వికారాబాద్, పరిగి, తాండూరు నియోజకవర్గాల్లో 27,872 ఓట్లు సాధించగా, లోక్‌సభ ఎన్నికల్లో ఏకంగా 1,93,467 ఓట్లు సాధించి తన సత్తా చాటుకుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో వికారాబాద్ నియోజకవర్గంలో 7,132 ఓట్లు కైవసం చేసుకుని 4.09 శాతం ఓట్లు దక్కించుకోగా, ఈ ఎన్నికల్లో 67,435 ఓట్లు సాధించి పోలైన ఓట్లలో బీజేపీ 41.32 శాతం కైవసం చేసుకుంది. అదే తాండూరు నియోజకవర్గంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో 4,087 ఓట్లతో 2.33 శాతం దక్కించుకోగా, ఈ ఎన్నికల్లో 77,654 ఓట్లు దక్కించుకుని 47.42 శాతం ఓట్లతో సత్తా చాటుకుంది. అదే పరిగి నియోజకవర్గంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో 16,653 ఓట్లు సాధించి 8.26 శాతం ఓట్లు దక్కించుకోగా, ఈ ఎన్నికల్లో 74,024 ఓట్లు కైవసం చేసుకుని 41.43 శాతం దక్కించుకుని రాబోయే రోజుల్లో గట్టి పోటీ ఇస్తామంటూ సవాల్ విసిరింది. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ చాలా వరకు పుంజుకున్నట్లు సాధించిన ఓట్ల ద్వారా స్పష్టమవుతోంది. కేంద్రంలో మరోసారి నరేంద్రమోదీ ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉన్న నేపథ్యంలో బీజేపీ క్షేత్రస్థాయిలో మరింత బలపడే అవకాశం ఉంది. ఎన్నికలకు ముందు నుంచే ఈసారి బీజేపీ అధిష్ఠానం దృష్టి సారించడంతో ఆశించిన ఫలితాలు సాధించగలిగామనే ఉత్సాహం కాషాయదళంలో వ్యక్తమవుతోంది.

కాంగ్రెస్ పార్టీకి సిగ్గులేదు!

- కమలాన్ని ఓడించేందుకు తీవ్రంగా ప్రయత్నించారు
- బీజేపీకి ఓటెయ్యొద్దని మైనారిటీలకు విషం నూరి పోశారు
- చేవెళ్ల ప్రజలు తెలివిగల్లోళ్లు.. అందుకే పట్టం కట్టారు
- అందరికీ అందుబాటులో ఉంటా..
- చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

5

ప్రతి రౌండ్‌లోనూ ఆధిక్యం కనబర్చిన బీజేపీ

- రెండో స్థానంతో సరిపెట్టుకున్న కాంగ్రెస్
- సీఎం రేవంత్‌రెడ్డి స్థానంలో కాషాయ జెండా రెపరెపలు
- బీజేపీ మెజార్టీ ఓట్లు కూడా సాధించని బీఆర్ఎస్

5

ఎన్నికల ఫలితాలపై జనం ఆసక్తి

టీవీలు, ఫోన్లలో వీక్షించిన ప్రజలు





తాండూరు/ జూన్ 4 : ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రాజకీయలను శాసించిన పట్లోళ్ల, పట్నం ఫ్యామిలీలకు లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం గెలుపు వరించడం లేదు. తాజాగా పట్నం సునీతారెడ్డి ఓటమే ఇందుకు నిదర్శం. హైదరాబాద్ పార్లమెంటు స్థానం నుంచి గతంలో టీడీపీ అభ్యర్థిగా పట్లోళ్ల ఇంద్రారెడ్డి పోటీ చేసి ఓడారు. అన్న టీడీపీ(లక్ష్మీపార్వతి వర్గం) నుంచి మహేందర్‌రెడ్డి హైదరాబాద్ స్థానంలో పోటీ ఓడారు. 2014 ఎన్నికల్లో చేవెళ్ల లోక్‌సభ స్థానం కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేసిన పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి తనయుడు కార్తీక్‌రెడ్డి నాటి టీఆర్ఎస్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి చేతిలో ఓడిపోయారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజిగిరి స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిగా వికారాబాద్ చైర్‌పర్సన్, పట్నం మహేందర్‌రెడ్డి సతీమణి సునీతారెడ్డి పోటీ చేశారు. మంగళవారం వెలువడిన ఫలితాల్లో ఆమె బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ చేతిలో ఓడిపోయారు. దీన్ని బట్టి దివంగత పట్లోళ్ల ఇంద్రారెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డిల ఫ్యామిలీల్లో ఎంపీ స్థానాలకు పోటీచేయడం కలిసిరాలేదని తెలుస్తోంది.

పట్లోళ్ల, పట్నం కుటుంబాలకు
కలిసిరాని ఎంపీ బరి!

ఇంద్రారెడ్డి, మహేందర్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి, సునీతారెడ్డిలకు తప్పని ఓటమి



మహేంద్రుడి నెక్స్ట్ స్టెప్పేంటి?

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో రాజకీయంగా పేరున్న ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డికి ఎదురుగాలి వీస్తోంది. తాజాగా లోక్‌సభ ఎన్నికల్లో ఆయన సతీమణి సునీతారెడ్డి ఓడిపోయారు. జిల్లా బీఆర్ఎస్‌లో తిరుగులేని నేతగా ఉన్న మహేందర్‌రెడ్డి లోక్‌సభ ఎన్నికల సమయంలో తన సతీమణి, కొడుకు రినీష్‌రెడ్డిలను కాంగ్రెస్‌లో చేర్చారు. ఆయన మాత్రం పార్టీ కండువా వేసుకోకుండానే కాంగ్రెస్ మద్దతుదారుగా కొనసాగుతున్నారు. మొదట చేవెళ్ల లోక్‌సభ సీటు ఆశించే ఆయన సునీతారెడ్డిని కాంగ్రెస్‌లో చేర్పించారు. అయితే రాజకీయాల్లో అనుకున్నదొకటి.. అయినది మరోటి అన్నట్టుగా చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో సునీతారెడ్డి మల్కాజ్‌గిరి బరిలో నిలిచారు. చేవెళ్ల టికెట్ అడిగితే మల్కాజిగిరికి మార్చడం వల్లే ఓటమిపాలయ్యారని ఆయన అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. పార్టీ మారినా ఆయనకు ఫలితం దక్కలేదు. మే 13న తాండూరులో పర్యటించిన మహేందర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. 'నేను తాండూరును వీడేది లేదు. ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీ చేస్తా' అని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల నాటికల్లా ఆయన తాండూరు నియోజకవర్గంపై దృష్టి కేంద్రీకరిస్తారన్న చర్చ సాగుతోంది. ఇక్కడ కాంగ్రెస్ ఎమ్మెల్యేగా మనోహర్‌రెడ్డి ఉన్నారు. మహేందర్‌రెడ్డి ప్రస్తుతం కాంగ్రెస్‌కు అనుకూలంగా కొనసాగుతూ లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రభుత్వ విప్‌గా నియామకం అయ్యారు. భవిష్యత్తులో ఆయన రాజకీయ వ్యూహమేమిటి? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

మల్కాజిగిరి ప్రజల విలక్షణ తీర్పు!

- అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ హవా
- పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ విజయం

మేడ్చల్, జూన్4 (ఆంధ్రజ్యోతి) : దేశంలోనే అతిపెద్ద పార్లమెంటు నియోజకవర్గం, మినీ ఇండియాగా పిలువబడే మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలోని ప్రజలు విలక్షణ తీర్పునిచ్చారు. ఆరు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు స్పష్టమైన మెజార్టీని కట్టబెట్టారు. ఏడింటికి ఏడు స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీ సాధించింది. ప్రస్తుతం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ కనీస పోటీని ఇవ్వలేకపోయింది. ఈటల రాజేందర్‌కు వచ్చిన మెజార్టీ ఓట్లు కూడా బీఆర్ఎస్ అభ్యర్థికి రాలేదు. బీఆర్ఎస్ ఓట్లన్నీ కూడా క్రాస్ ఓటింగ్ జరిగి బీజేపీకి పోలైనట్లు ఆపార్టీ శ్రేణులు చర్చించుకోవడం గమనార్హం.



అసెంబ్లీలో ఓడి... పార్లమెంటులో గెలిచి..

మల్కాజిగిరి పార్లమెంటు నుంచి గెలుపొందిన ఈటల రాజేందర్ అసెంబ్లీ ఎన్నికల్లో రెండు స్థానాల్లో పోటీ చేసి ఓడిపోయారు. హుజూరాబాద్, గజ్వేల్ స్థానాల్లో పోటీ చేసి ఓటమి చెందారు. తిరిగి పార్లమెంటు ఎన్నికల్లో మేడ్చల్ జిల్లా మల్కాజిగిరి పార్లమెంటు నుంచి పోటీ చేసి గెలుపొందారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నియోజకవర్గంలో ఓటమి చెంది మల్కాజిగిరి పార్లమెంటు నుంచి పోటీ చేసి గెలుపొందారు. అనంతరం టీపీసీసీ అధ్యక్షుడిగా పనిచేసి 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొంది ఏకంగా సీఎం పీఠాన్ని అధిష్ఠించారు. ఈటల రాజేందర్ కూడా అదే తరహాలో తన అదృష్టాన్ని పరీక్షించుకున్నాడు. గతంలో జరిగిన పరిణామాలను బట్టి చూస్తే ఈటల రాజేందర్ కూడా కేంద్ర మంత్రి అయ్యే అవకాశం ఉందని, మల్కాజిగిరి పార్లమెంటు నుంచి గెలుపొందిన వారు ఉన్నత పదువులు పొందే అవకాశం ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఎల్లమ్మ ఆలయం వద్ద అన్నదానం

శామీర్‌పేట, జూన్ 4: మండల కేంద్రంలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం ఘనంగా అన్నదానం జరిగింది. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓడి బియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. అల్వాల్ పరిధిలోని బొల్లారం గ్రామానికి చెందిన తుమ్మల నరేందర్‌రెడ్డి జ్ఞాపకార్థం వారి సతీమణి తుమ్మల లక్ష్మీరెడ్డి, కూతురు తుమ్మల నవ్యరెడ్డి, కుమారుడు తుమ్మల పవన్‌రెడ్డి, వారి కుటుంబసభ్యులు అమ్మవారికి వెండి కిరీటం బహూకరించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఈ అన్నదానంలో ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, భక్తులు, రాజీవ్‌రహదారిపై వెళ్లే భక్తులు పెద్దఎత్తున పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.



ఆలయంలో అన్నదానం చేస్తున్న దాతలు



మంచాలలో నిర్మానుష్యంగా మారిన రోడ్డు

ఎన్నికల ఫలితాలపై జనం ఆసక్తి

» టీవీలు, ఫోన్లలో వీక్షించిన ప్రజలు

కేశంపేట, జూన్ 4 : సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడంతో తెలుసుకునేందుకు ప్రజలు ఆసక్తి కనబర్చారు. టీవీలు, స్మార్ట్ ఫోన్లలో ఎప్పటికప్పుడు ఎన్నికల ఫలితాలను తెలుసుకున్నారు. ఉదయం నుంచి టీవీలు, సెల్‌ఫోన్లకు అతుక్కుపోయారు. ఫలితాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో, చానళ్లలో పరిశీలించారు. తెలంగాణ లోక్‌సభ సీట్ల ఫలితాలతో పాటు ఆంధ్రప్రదేశ్ ఎన్నికల వివరాలను ఆసక్తిగా గమనించారు. ఏపీలో టీడీపీ కూటమి గెలవడంతో ఆ పార్టీ అభిమానులు సంబరాలు చేసుకున్నారు.

వెలవెలబోయిన కార్యాలయాలు


యాచారం: లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో యాచారం మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు వెలవెలబోయాయి. ఎన్నికల ఫలితాలను ఇళ్లలో ఉండి టీవీల్లో వీక్షించేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపారు. తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్లు తప్ప మిగతా సిబ్బంది రాలేదు. మండల పరిషత్‌లో సూపరింటెండెంట్, మరో ముగ్గురు ఉద్యోగుల, అటెండర్లు తప్ప మిగతా వారు రాలేదు. కొందరు అధికారులు భువనగిరిలో ఓట్ల లెక్కింపు విధులకు వెళ్లారు. ఎన్నికల ఫలితాలతో జనం కూడా కార్యాలయాలకు రాలేదు.

నిర్మానుష్యంగా మారిన రహదారులు

మంచాల: సార్వత్రిక ఎన్నికల ఫలితాలను మంచాల మండల ప్రజలు ఆసక్తిగా గమనించారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా టీవీలకు అతుక్కుపోయి ఏ పార్టీ ఎన్నిసీట్లు సాధించించి అని వీక్షించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఫలితాలపై ఎక్కువ ఆసక్తి చూపారు. వాహదారులు ఎక్కువ మంది రోడ్లపై రాక రహదారులు నిర్మానుష్యంగా మారాయి. సాయంత్రం కూడళ్లకు చేరి ఫలితాలపై మాట్లాడారుకున్నారు.

కాంగ్రెస్ పార్టీకి సిగ్గులేదు..

» బీజేపీని ఓడించేందుకు తీవ్రంగా ప్రయత్నించారు
» బీజేపీకి ఓటెయ్యొద్దని మైనారిటీలకు విషం నూరి పోశారు
» చేవెళ్ల ప్రజలు తెలివిగల్లోల్లు.. బీజేపీకే పట్టం కట్టారు
» అందరికీ అందుబాటులో ఉంటా
» ప్రతి గ్రామాన్ని రెండు సార్లు సందర్శిస్తా
» చేవెళ్ల అభివృద్ధి కోసం నిరంతరం కృషిచేస్తా
» చేవెళ్ల బీజేపీ అభ్యర్థి, విజేత కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



రంగారెడ్డి అర్బన్/చేవెళ్ల, జూన్4 : కాంగ్రెస్ పార్టీకి సిగ్గులేదని చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. కౌటింగ్ కేంద్రంలోని మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ తీరుపై ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎలాగైనా గెలవాలని కాంగ్రెస్ ఎన్నో కుట్రలు చేసిందన్నారు. బీజేపీని ఓడించేందుకు ఆరు లక్షల మంది మైనార్టీల్లో దుష్ప్రచారం చేశారని, బీజేపీ గెలిస్తే నష్టం కలుగుతుందని మైనార్టీలకు నూరి పోశారని ఆరోపించారు. 99శాతం బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్ నాయకులు రకరకాల ప్రయత్నాలు చేశారని చెప్పారు. ఈ ప్రయత్నాలు ఇటు దేశానికి, రాష్ట్రానికి, చేవెళ్లకు మంచిది కాదన్నారు. మేము అందరినీ కలుపుకొని పోదామనుకుంటున్నాం. మా సిద్ధాంతం సబ్ కా సాత్ సాత్.. సబ్‌కా వికాస్ అన్నారు. ఈ సిద్ధాంతాన్ని చేవెళ్లలో ఓడగొట్టేందుకు తీవ్ర ప్రయతం చేసినా విఫలమయ్యారని పేర్కొన్నారు. చేవెళ్ల స్థానం పరిధిలో నాలుగున్నర లక్షల ముస్లిం ఓట్లు ఉన్నాయని, అందరికంటే ముందు తానే ఎన్నికల ప్రచారం షురూ చేశానని తెలిపారు. మైనారిటీ ఓట్లపైనే కాంగ్రెస్ ఆధారపడిందన్నారని, తాను సిస్టమెటిక్‌గా మూడున్నర నెలల పాటు కష్టపడినట్లు చెప్పారు. గ్రామాల్లోని ఆలయాల్లో భజనలు, యువకులకు క్రీడాపోటీలు, ఆశీర్వాద యాత్ర చేసినట్లు తెలిపారు. దాదాపు 30 ప్రోగాములు చేపట్టి ప్రజలతో మమేకం కావడంతోనే తన గెలుపు సాధ్యమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎన్నో కోట్ల రూపాయలు ఖర్చు పెట్టారని, మైనారిటీ ఓట్లన్నీ కాంగ్రెస్ చేతిలోనే ఉన్నాయని చెప్పుకున్నారని విమర్శించారు. ఫలితాల నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మరింత పనిచేయాల్సి ఉందన్నారు. ఎగ్జిట్ పోల్స్ అనుకున్నట్లు రాలేదని, 100శాతం మోదీ ప్రభుత్వమే వస్తుందన్నారు. తన గెలుపు కోసం పార్టీ కార్యకర్తలు, నాయకులు అహర్నిషలు కష్టపడ్డారన్నారు. చేవెళ్లలో ఇప్పటి వరకు బీజేపీ గెలవలేదని, ఎమ్మెల్యే కూడా లేరన్నారు. ఎన్నికల్లో బీజేపీ గెలవొద్దని కాంగ్రెస్ నాయకులు మైనార్టీల్లో విషాన్ని నూరి పోశారన్నారు. చేవెళ్లలో గెలవడం చాలా కఠినమన్నారు. చేవెళ్ల ప్రజలు తెలివిగల్లోళ్లని తాను గర్వంగా చెప్పుకుంటున్నానని, వాళ్లకు ఎంతో అవగాహన ఉందన్నారు. ఏ పార్టీ అయితే దేశాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధిచేస్తుందో అలాంటి నాయకుడినే గెలిపించారని సంతోషాన్ని వ్యక్తం చేశారు. దేశానికి మోదీ అవసరమన్నారు. తాను ఇంతకు ముందు ఎలా పని చేశానో ఇక ముందూ అలాగే పనిచేస్తానని, అందరికీ అందుబాటో ఉంటానన్నారు. ప్రతీ గ్రామాన్ని రెండు సార్లు పర్యటించి ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎప్పుడైనా తన వద్దకు వచ్చి సమస్యలు చెప్పుకోవచ్చని, పార్లమెంట్‌లోనూ తన పని తాను చేస్తానని విశ్వేశ్వర్‌రెడ్డి వెల్లడించారు.

కమల వికాసం

(మొదటి పేజీ తరువాయి)

గణనీయంగా పెరిగింది. ఈ ఎన్నికల్లో బీజేపీకి 48.36శాతం ఓట్లు లభించడం విశేషం. అలాగే కాంగ్రెస్‌కు 38.03శాతం ఓట్లు లభించాయి. బీఆర్‌ఎస్ ఓటు బ్యాంకు 10.68 శాతానికి పడిపోయింది. అంటే ఆరు నెలల కాలంలో 30శాతం ఓట్లు ఈ నియోజకవర్గపరిధిలో బీఆర్‌ఎస్ కోల్పోయింది. అలాగే మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం పరిధిలో కూడా ఇదే జరిగింది. ఈ స్థానంలో బీజేపీ అనూహ్యంగా పుంజుకుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల పరిధిలో బీఆర్‌ఎస్‌కు 47శాతం ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 30.05శాతం,. బీజేపీకి 20.56శాతం ఓట్లు లభించాయి. ఈ పార్లమెంట్ ఎన్నికలో పరిస్థితి పూర్తిగా తారుమారైంది. ఒక్క ఎమ్మెల్యే కూడా లేకున్నా బీజేపీ రికార్డు స్థాయిలో ఓట్లను కొల్లగొట్టగలిగింది. మల్కాజిగిరి పార్లమెంట్‌లో బీజేపీకి 51.64శాతం ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 31.24శాతం, బీఆర్‌ఎస్‌కు 15.65శాతం చొప్పున ఓట్లు పడ్డాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా మల్కాజిగిరి పార్లమెంట్ చరిత్రలో బీజేపీకి 3.91లక్షల పైచిలుక మెజార్టీ లభించింది. ఇక్కడ బీజేపీ నుంచి పోటీ చేసిన ఈటల రాజేందర్ కూడా ఈ నియోజకవర్గానికి కొత్త వ్యక్తే అయినప్పటికీ జనం ఆయనకు ఓట్ల వర్షం కురిపించారు.

పోస్టల్ బ్యాలెట్‌లో బీజేపీదే ఆధిక్యం

మేడ్చల్/రంగారెడ్డి అర్బన్ (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి పార్లమెంటు స్థానానికి పోలైన పోస్టల్ బ్యాలెట్ల ఓట్లలో బీజేపీ ఆధిక్యం కనబర్చింది. బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు 10,330 ఓట్లు పోలవగా, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డికి, 6,230, బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి 1,789 ఓట్లు పోలయ్యాయి.

'కొండా'దే హవా...!

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో కూడా బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి హవా కొనసాగింది. మొత్తం 19397 పోస్టల్ బ్యాలెట్స్‌లో 221 ఓట్లు రిజెక్ట్ కాగా 110 ఓట్లు ఇన్‌వ్యాలీడ్‌గా గుర్తించారు. పోలైన పోస్టల్ బ్యాలెట్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు 1428 ఓట్లు రాగా బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి 11365 ఓట్లు వచ్చాయి. అలాగే కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి 6124 ఓట్లు వచ్చాయి. పోస్టల్ బ్యాల్‌ట్‌లో బీజేపీ అభ్యర్థి కొండాకు 5241 ఓట్ల అదిక్యతను సాధించారు.



కందుకూరులో నాయకుల సంబురాలు

నోటాకు 6,308 ఓట్లు

చేవెళ్ల పార్లమెంట్‌కు 43 మంది అభ్యర్థులు బరిలో నిచిచారు. వీరందరిలో ఏ అభ్యర్థి నచ్చలేదని 6308 ఓటర్లు నోటాకు జై కొట్టారు.

కొడంగల్ నుంచే కాంగ్రెస్‌కు మెజారిటీ

కొడంగల్: పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపులో కొడంగల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్‌కు మెజారిటీ లభించింది. అందులో మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరిగిన ఓట్ల లెక్కింపులో 21 రౌండ్లు జరగగా ప్రతీ రౌండ్‌లో కాంగ్రెస్ ఆధిక్యత చాటుకుంది. నియోజకవర్గ పరిధిలో 1,84,786 ఓట్లు పోల్ కాగా అందులో బీజేపీకి 62,560, కాంగ్రెస్‌కు 84,414, బీఆర్‌ఎస్‌కు 15,958 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ పార్టీకి 21,854 ఓట్ల మెజారిటీ వచ్చినట్లు అధికారులు ప్రకటించారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ నుంచి జిల్లాలోనే అత్యధికంగా మెజారిటీ వంశీచంద్‌రెడ్డికి వచ్చాయి. ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ మధ్య పోటీ నెలకొనగా అందులో ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ ఆధిక్యత సాధించింది.

అన్ని రౌండ్లలో 'కొండా'దే ఆధిక్యం

(మొదటి పేజీ తరువాయి)

విశ్వేశ్వర్‌రెడ్డికి 42,568 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి 28,648 ఓట్లు వచ్చాయి. తొలి రౌండ్‌లో విశ్వేశ్వర్‌రెడ్డికి 13,920 ఓట్ల ఆధిక్యం వచ్చింది. రెండో రౌండ్‌లో బీజేపీ అభ్యర్థి 30,342 ఓట్ల లీడ్‌కు చేరారు. మూడో రౌండ్‌లో 46,641 ఓట్ల మెజారిటీ, నాలుగో రౌండ్‌లో 53,199 ఓట్లు, ఐదో రౌండ్‌లో 64,874, ఆరో రౌండ్ వచ్చేసరిగి రంజిత్‌రెడ్డిపై విశ్వేశ్వర్‌రెడ్డి 78,776 ఓట్ల ఆదిక్యాన్ని సాధించారు. 7వ రౌండ్‌లో 90,205 ఓట్లు, 8వ రౌండ్‌లో 1,06,494 ఓట్లు, 9వ రౌండ్‌లో 1,31,527 ఓట్లు, 10వ రౌండులో 1,30,223 ఓట్లు, 11వ రౌండులో 1,25,104 ఓట్లు, 12వ రౌండ్ 1,10,352 ఓట్లు, 13వ రౌండులో 1,15,112 ఓట్లు, 14వ రౌండులో 1,16,769 ఓట్లు, లీడ్ వచ్చింది. 15వ రౌండు ముగిసే 1,14,953 ఓట్ల లీడ్ వచ్చింది. 16వ రౌండు ముగిసే వరకు 1,31,239 ఓట్లు, 17వ రౌండ్ 1,42,537ఓట్లు, 18వ రౌండ్ ముగిసే 1,47,394 ఓట్లు, 19వ రౌండు 1,56,515 ఓట్లు, 20వ రౌండు 1,62,149 ఓట్లు, 21వ రౌండు 1,64,958 ఓట్లు, 22వ రౌండు 1,66,139 ఓట్లు, 23వ రౌండ్ ముగిసే వరకు 1,67,778ఓట్లు, చివరి రౌండ్ 24వ రౌండ్ ముగిసే వరకు బీజేపీ 1,67,656 లీడ్ సాధించింది.

ప్రజా తీర్పును గౌరవిస్తున్నా

» కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి



చేవెళ్ల/షాబాద్, జూన్ 4 : ప్రజాతీర్పును గౌరవిస్తున్నానని చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల మండలం గొల్లపల్లిలోని బీఎస్‌ఐటీలో మంగళవారం ఓట్ల లెక్కిపు నిర్వహించారు. ప్రత్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రతీ రౌండ్‌లో ఆధిక్యత కొనసాగుతున్న సందర్భంలో రంజిత్‌రెడ్డి కౌంటింగ్ మధ్యలో నుంచి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. తాను ఓటమిని అంగీకరిస్తున్నానన్నారు. తన గెలుపు కోసం కష్టపడిన కార్యకర్తలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎక్కువగా సిటీ ఓట్లు బీజేపీకి అనుకూలంగా పడ్డాయని అన్నారు. చేవెళ్ల ఎంపీగా గెలుపొందిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీకి పట్టం కట్టడం సంతోషం

» మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



చేవెళ్ల/షాబాద్, జూన్ 4 : చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం ప్రజలు బీజేపీకి పట్టం కట్టడం సంతోషంగా ఉందని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నరేంద్రమోదీ నాయకత్వంలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో అనేక కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు సేవ చేశారన్నారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో ఒక్క ఎమ్మెల్యే కూడా లేకున్నా ఎన్నికల్లో విజయ దుందుబి మోగించామన్నారు రాష్ట్రంలో 8 సీట్లు గెలవడం సంతోషమన్నారు. ఎంపీ నిధులతో చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో అబివృద్ధి చేయనున్నట్లు ఆయన చెప్పారు.



మల్లు రవి, కసిరెడ్డి, వంశీ, రాజేష్‌రెడ్డిలను సన్మానిస్తున్న నాయకులు

ప్రజలకు పెద్ద జీతగాడిలా పనిచేస్తా

ఆమనగల్లు, జూన్ 4 : ప్రజలకు పెద్దజీతగాడిలా పనిచేస్తామనని నాగర్‌కర్నూల్ ఎంపీగా గెలుపొందిన డాక్టర్ మల్లు రవి అన్నారు. ఆయనకు మంగళవారం రాత్రి ఆమనగల్లులో కాంగ్రెస్ నాయకులు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలువడానికి మంత్రి జూపల్లి కృష్ణరావ్, కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, జడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్‌తో కలిసి హైదరాబాద్ వెళ్తున్న మల్లు రవికి ఆమనగల్లులో కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. మిఠాయిలు పంచారు. తన విజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు మల్లు రవి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా, మండల నాయకులు వస్పుల జంగయ్య, జగన్, వస్పుల మానయ్య, కాలె మల్లయ్య, ఖాదర్ ఖాద్రి, జంతుక యాదయ్య, అవ్వరి శివలింగం, శ్రీనివాస్‌రెడ్డి, శివాజీ, పుసాల సత్యం ,గాజుల శ్రీను, రజాక్, బాబా, శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన కౌంటింగ్

» సాఫీగా ఓట్ల లెక్కింపు

రంగారెడ్డి అర్బన్/చేవెళ్ల, జూన్ 4 : పార్లమెంట్ ఎన్నికల్లో చివరి ఘట్టమైన ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలో మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. పార్లమెంటు నియోజకవర్గంలోని మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల, పరిగి, వికారాబాద్, తాండూరు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో పోలైన ఓట్లను చేవెళ్ల మండలం గొల్లపల్లిలో గల బండారి శ్రీనివాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కాలేజీలో కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య మంగళవారం లెక్కించారు. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక నేతృత్వంలో వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఇతర ఉన్నతాధికారులు కౌంటింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. ఎన్నికల కౌంటింగ్ పరిశీలకులు రాజేందర్‌కుమార్ కటారియా, మృణాళినిసావంత్‌లు ఓట్ల లెక్కింపు పరిశీలించారు. పకడ్బందీ ఏర్పాట్లు చేసిన ఫలితంగా ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగిసింది. ఉదయం 5గంటల నుంచే కౌంటింగ్‌కు సన్నాహాలు చేపట్టారు. ఎన్నికల పరిశీలకులు, అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో కలెక్టర్ నేతృత్వంలో కౌంటింగ్ సిబ్బంది మూడవ రాండమైజేషన్ నిర్వహించి, ఆ జాబితా ప్రకారంగా సిబ్బందికి ఆయా టేబుళ్ల వద్ద ఓట్ల లెక్కింపు బాధ్యతలు స్వీరించారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించిన మీదట, ఈవీఎంలలో నమోదైన ఓట్లను లెక్కిస్తూ రౌండ్ల వారీగా ఫలితాలను వెల్లడించారు. టేబుళ్ల వారీగా కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయకులు, సూక్ష్మ పరిశీలకులతో పాటు స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి వెంట వెంటనే ఈవీఎంలను కౌంటింగ్ హాళ్లకు తరలించేలా అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ.. వెంట వెంటనే ఓట్ల లెక్కింపు జరుపుతూ ఫలితాలు వెల్లడించారు. పోస్టల్ బ్యాలెట్లతో పాటు, పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు పూర్తి కాగా, అన్ని అంశాలను సరిచూసుకున్న మీదట రిటర్నింగ్ అధికారి ఒక్కో రౌండ్ వారీగా ఫలితాలను వెల్లడించారు. మొత్తం 43 మంది అభ్యర్థులు పోటీ చేయగా, ఒక్కో అభ్యర్థి వారీగా పోల్ అయిన ఓట్ల వివరాలను ప్రకటించారు. మహేశ్వరం, రాజేంద్రనగర్, అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు 20 రౌండ్లలో పూర్తి చేయగా, శేరిలింగంపల్లి 24 రౌండ్లు, చేవెళ్ల 22 రౌండ్లు, పరిగి 22 రౌండ్లు, వికారాబాద్ 21 రౌండ్లు, తాండూరు 20 రౌండ్లలో కౌంటింగ్ జరిపి రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక తుది ఫలితాలను ప్రకటించారు. బీజేపీ అభ్యరి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి పోస్టల్ బ్యాలెట్లను కలుపుకుని 8,09,882 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి 6,36,985 ఓట్లు వచ్చాయి. విశ్వేశ్వర్‌రెడ్డి 1,72,897ఓట్ల మెజారిటీతో గెలుపొందినట్లు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక ప్రకటించారు. చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థిగా గెలుపొందిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి పరిశీలకుల సమక్షంలో కలెక్టర్ ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. రిటర్నింగ్ అధికారి కలెక్టర్ శశాంక పోలీస్ డీసీపీ శ్రీనివాస్, ఇతర ఉన్నతాధికారులు కౌంటింగ్ కేంద్రంలోనే ఉండి, ఓట్ల లెక్కింపు పూర్తయ్యేంత వరకు నిశితంగా పర్యవేక్షణ జరిపారు. కౌంటింగ్ కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాలలో గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసి, 144 సెక్షన్ నిషేధాజ్ఞలు అమలు చేశారు. కౌంటింగ్ కేంద్రం లోనికి ఇతరులెవరినీ అనుమతించలేదు. కౌంటింగ్ సిబ్బందికి, వివిధ బాధ్యతలు నిర్వర్తించిన సిబ్బందికి ఎంట్రీ పాసులు జారీ చేసినప్పటికీ, వారిని సైతం క్షుణ్ణంగా తనిఖీలు చేసి కౌంటింగ్ విధులకు పంపించారు. సెల్‌ఫోన్‌లు, వీడియోలు, కెమెరాలను నిషేధించారు. పకడ్బందీ ఏర్పాట్ల మధ్య అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో పారదర్శకంగా, ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా ఓట్ల లెక్కింపును పూర్తి చేసి పార్లమెంటు ఎన్నికల నిర్వహణ ప్రక్రియను విజయవంతంగా ముగిసింది. ఎలాంటి ఆటంకాలు లేకుండా జిల్లాలో ఎన్నికలను సాఫీగా నిర్వహించేందుకు సహకరించిన వారందరికీ రిటర్నింగ్ అధికారి కలెక్టర్ శశాంక ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు అంకితభావంతో కృషి చేసిన అధికారులను, సిబ్బందిని ఆయన అభినందించారు.

ప్రతి రౌండ్‌లోనూ ఆధిక్యం కనబర్చిన బీజేపీ

మేడ్చల్ జూన్ 4(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల సందడి మొదలైనప్పటి నుంచీ చాలా మంది ఊహించినట్టుగానే మల్కాజిగిరి స్థానంలో బీజేపీ ఘన విజయం సాధించింది. సీఎం రేవంత్‌రెడ్డి సిట్టింగ్ స్థానంలో బీజేపీ అభ్యర్థి ఈటెల రాజేందర్ 3లక్షల 91 వేల 475ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థిని పట్నం సునీతారెడ్డిపై విజయం సాధించారు. ఈటల 9లక్షల91వేల 42ఓట్లు సాధించారు. సునీతారెడ్డి 5లక్షల 99వేల 567 ఓట్లకే పరిమితమయ్యారు. మల్కాజిగిరి లోక్‌సభ స్థానంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు మంగళవారం కీసరలోని హోళీ మేరీ కాలేజీ, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, వెస్లీ కాలేజీల్లో నిర్వహించారు. మొదట పోస్టల్ బ్యాలెట్లను, అనంతరం ఈవీఎంల ఓట్లను లెక్కించారు. 21 రౌండ్‌ల వారీగా ఓట్ల లెక్కింపు పూర్తి చేశారు. మొదటి రౌండ్ నుంచే బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఆధిక్యత కనబర్చారు. రౌండ్ రౌండ్‌కూ ఈటల లీడ్ పెరిగింది. మధ్యాహ్నం కల్లా ఫలితంపై స్పష్టత రాగానే కౌంటింగ్ కేంద్రం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి సునీతారెడ్డిలు వెళ్లిపోయారు. మధ్యాహ్నం తరువాత బీజేపీ గెలుపు ఖాయం కావడంతో పార్టీ శ్రేణులు కౌంటింగ్ కేంద్రం వద్దకు చేరుకున్నాయి. ఈటెల రాజేందర్ మూడు చోట్ల కౌంటింగ్ కేంద్రాలను సందర్శించి లెక్కింపుపై ఆరా తీశారు.

గతంలో సీఎం సిట్టింగ్ సీటే అయినా..!

మల్కాజిగిరి స్థానంలో 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్‌రెడ్డి గెలుపొందారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఆయన ఈ స్థానానికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో ఇక్కడ గెలుపును పాలక కాంగ్రెస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఎన్నికల సమయంలో ఆ మేరకు ప్రచారాన్ని నిర్వహించారు కూడా! సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఆ పార్టీ శ్రేణులు గెలుపు కోసం చివరి వరకు ప్రయత్నించినా ఆశించిన ఫలితం రాలేదు. ఫలితాల్లో హస్తం పార్టీ ఇక్కడ రెండో స్థానానికే పరిమితమైంది.

తక్కువ ఓట్లతోనే సరిపెట్టుకున్న కారు పార్టీ

మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా, నగరంలోని నియోజకవర్గాల్లో దుమ్మురేపిన బీఆర్‌ఎస్ లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం చతికిలబడింది. ఆ పార్టీ మల్కాజిగిరిలో మూడో స్థానానికి పరిమితమైంది. విజేత ఈటెల సాధించిన మెజార్టీ ఓట్లన్ని కూడా బీఆర్‌ఎస్ సాధించలేకపోయింది. 3లక్షల 486 ఓట్లు మాత్రమే బీఆర్‌ఎస్ అభ్యర్థికి వచ్చాయి. బీఆర్‌ఎస్ ఓట్లు భారీగా బీజేపీకి క్రాస్ అయ్యాయని ఆ పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి. ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇవ్వలేకపోవడంపై ఆ పార్టీ శ్రేణులు నిరుత్సాహానికి గురయ్యాయి.

పరిగి, తాండూరులో వికసించిన 'కమలం'

పరిగి, జూన్ 4: పరిగి చరిత్రలో బీజేపీ రికార్డు సృష్టించింది. పరిగి అసెంబ్లీ నియోజకవర్గంలో 2003ఓట్లు కాంగ్రెస్‌పై బీజేపీ మెజార్టీ సాధించింది. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌లో పరిగి అసెంబ్లీ పరిధిలో మొత్తం ఓటర్లు 2,66,566 ఓట్లు ఉండగా, 1,78,637 ఓట్లు పోలైన సంగతి విధితమే. పరిగి అసెంబ్లీ నుంచి బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి 73,788 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి 71,785 ఓట్లు పడ్డాయి. అయితే బీజేపీ 2003 ఓట్ల మెజార్టీ లభించింది. బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు 23,151 ఓట్లు పడ్డాయి. ఇతరులు అందరికి కలిపి 9913 ఓట్లు పడ్డాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపికి 16,597 ఓటు రాగా, ఇప్పుడు 74034 ఓట్లు పడ్డాయి. గత అసెంబ్లీకి,పార్లమెంట్‌కు పోలిస్తే బీజేపికి ఐదు రెట్ల ఓట్లు అధికంగా పడ్డాయి.

అసెంబ్లీ ఎన్నికలను పోలిస్తే..

గత అసెంబ్లీ ఎన్నికల పోలిస్తే ఓటర్ల సరళి తారుమారైంది. నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో పరిగి నియోజకవర్గంలో 2,59,422 ఓట్లు ఉండగా, 1,98,547ఓట్లు పోలైన సంగతి తెలిసిందే. అప్పట్లో కాంగ్రెస్ అభ్యర్థి టి.రామ్మోహన్‌రెడ్డికి 98,183 ఓట్లు రాగా, బీఆర్ఎస్ అభ్యర్థి కె.మహేశ్‌రెడ్డికి 74,227, బీజేపీ అభ్యర్థి బి.మారుతికిరణ్‌కు 16,597 ఓట్లు పడ్డాయి. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 73,788ఓట్లతో పైచేయి కాగా, 71,785ఓట్లతో కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయింది. బీఆర్ఎస్ అయితే 23,151 ఓట్లతో చతికిలపడింది. విశ్వేశ్వర్‌రెడ్డి విజయం



పరిగి: బీజేపీ శ్రేణుల సంబురాలు

సాధించడంతో పరిగిలో బీజేపీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. పరిగిలోని ప్రధాన చౌరస్తాల్లో బాణ సంచాలను పేల్చి సంబురాలను జరుపుకున్నారు.

ఊహించని విధంగా బీజేపీ ఓటు బ్యాంకు

తాండూరు/తాండూరు రూరల్: అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అనూహ్యంగా ఓటుబ్యాంకును సంపాదించుకుంది. లెక్కలకు అందని విధంగా బీజేపీ ఓటు బ్యాంకును సాధించింది. అధికార కాంగ్రెస్, పట్టు ఉన్న బీఆర్ఎస్ కంటే తాండూరులో బీజేపీ ఎక్కువ ఓట్లు సాధించింది. దీంతో తాండూరులో కమలం వికసించి బలపడిందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. గత 2023 డిసెంబర్‌లో నాలుగు నెలల కిందట జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కనీసం బీజేపీ అభ్యర్థే బరిలో లేరు. బీఆర్ఎస్‌కు గత అసెంబ్లీ ఎన్నికల్లో 78079ఓట్లు రాగా పార్లమెంట్ ఎన్నికల్లో 10998 ఓట్లు వచ్చాయి. బీజేపీకి అసెంబ్లీ ఎన్నికల్లో 3971, పార్లమెంట్‌లో 77654ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీకి అసెంబ్లీ ఎన్నికల్లో 84662ఓట్లు, పార్లమెంట్ ఎన్నికల్లో 69864 ఓట్లు వచ్చాయి. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే బీఆర్ఎస్ పార్టీ 67081 ఓట్లు తగ్గాయి. బీజేపీకి 73683 ఓట్లు పెరిగాయి. అధికార కాంగ్రెస్ పార్టీకి 14798ఓట్లు తగ్గాయి. బీజేపీ మండలంలోని గ్రామాల్లో బీజేపీ ఆధిక్యత ప్రదర్శించింది. కొన్ని గ్రామాల్లో కాంగ్రెస్ ముందంజలో ఉంటూ పట్టు నిలుపుకోగా, బీఆర్ఎస్ పార్టీకి ఒక్క గ్రామంలో లీడ్ రాగా, మిగితా గ్రామాల్లో పూర్తిగా వెనకబడింది.

మోమిన్‌పేటలో బీజేపీ అభ్యర్థికి మెజారిటీ

మోమిన్‌పేట్: చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మోమిన్‌పేట్ మండలం నుంచి గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థికి 1115 మెజారిటీని అందించగా ప్రస్తుతం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి కొండ విశ్వేశ్వర్‌రెడ్డికి 10956 ఓట్ల మెజారిటీ అందించడంతో పార్టీనాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపునకు యువత, పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా కృషిచేయడం అభినందనీయమని పార్టీ నాయకులు హర్షం వ్యక్తంచేశారు.

ఘనంగా అసెంబ్లీ స్పీకర్ జన్మదిన వేడుకలు



వికారాబాద్: అనంతగిరిలో ప్రత్యేక పూజలు చేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



వికారాబాద్: ప్రసాద్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న కొండల్ రెడ్డి



వికారాబాద్: స్పీకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న శ్రీనివాస్ గౌడ్, బొండల శ్రీనివాస్



వికారాబాద్: ప్రసాద్‌కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న సుధాకర్‌రెడ్డి

వికారాబాద్, జూన్ 4: తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఈ వేడుకలకు కాంగ్రెస్ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా ప్రసాద్‌కుమార్ అనంత పద్మనాభస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ అర్చకులు ఘనంగా సన్మానించి ఆశీర్వదించారు. అనంతరం ఆలంపల్లి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి గంగారం మెథడిస్ట్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ కొండల్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సత్యనారాయణ, మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్, ఎర్రవల్లి జాఫర్, శ్రీనివాస్‌గౌడ్, బొండల శ్రీనివాస్, కార్యకర్తలు వివిధ సంఘాల నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ధారూరు: శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు మండల కాంగ్రెస్ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వికారాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగిన జన్మదిన వేడుకల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.రఘువీరారెడ్డి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కాగా ధారూరులో పార్టీ నాయకులు కేక్ కట్‌చేసి, పండ్లు పంచిపెట్టారు.

మర్పల్లి: తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో కేక్‌లు కట్‌చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మరికొంత మంది కాంగ్రెస్ నాయకులు వికారాబాద్‌కు వెళ్లి స్పీకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వికారాబాద్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు కాంగ్రెస్ పార్టీ మర్పల్లి మండల అధ్యక్షుడు రవీందర్, పార్టీ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

బంట్వారం, (కోట్‌పల్లి): బంట్వారం, కోట్‌పల్లి మండల కేంద్రాల్లో మంగళవారం ఘనంగా తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామాలు నుంచి వికారాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పోచారం వెంకటేశం, రాంచంద్రారెడ్డి (టిల్లు), నరసింహారెడ్డి, నర్సింహులు, శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.



ధారూరు: స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు పుష్ప గుచ్ఛం అందజేస్తున్న రఘువీరారెడ్డి



మర్పల్లి: స్పీకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న వెంకట్‌రామ్‌రెడ్డి

మేడ్చల్ జిల్లాలో..

మేడ్చల్ టౌన్, జూన్ 4: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు మంగళవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వికారాబాద్‌లోని స్పీకర్ నివాసంలో గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ భేరీ ఈశ్వర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కుంచం శ్రీనివాస్‌గౌడ్, జనార్ధన్‌రెడ్డి, గడిల కృష్ణారెడ్డి, రాముగౌడ్ తదితరులు స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మోమిన్‌పేట్: తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం మండల అధ్యక్షుడు మన్నె శంకర్‌యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు వేమారెడ్డి, కొనింటి సురేశ్, సామెల్, సోమారపు రవి తదితరులు హెల్ప్ ఆల్ సొసైటీ అనాథాశ్రమంలోని విద్యార్థులతో కలిసి కేక్‌ను కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు కార్పెట్‌లు, పెన్సిళ్లు, నోట్‌బుక్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మల్లేశం, కె.రాజు, కె.నర్సింహులు, కె.కృష్ణ, రవూఫ్, రామకృష్ణారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు బాగ్దాద్ పటేల్, అశోక్, నర్సింహులు పాల్గొన్నారు.



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఈశ్వర్ తదితరులు



మోమిన్‌పేట్: హెల్ప్ ఆల్ సొసైటీ విద్యార్థులతో కలిసి వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు



వికారాబాద్: స్పీకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ మర్పల్లి మండల అధ్యక్షుడు రవీందర్, పార్టీ నాయకులు

కొత్లాపూర్‌లో కొనసాగుతున్న అమ్మవారి జాతర

● వేపచీర, బోనాలతో మొక్కులు తీర్చుకున్న భక్తులు



కొత్లాపూర్ ఎల్లమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి

తాండూరు రూరల్, జూన్ 4: కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ జాతర ఘనంగా కొనసాగుతోంది. నెల రోజులు జరిగే ఈ జాతరకు చుట్టు పక్కల గ్రామాలతో పాటు కర్నాటక, మహారాష్ట్ర నుంచీ భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారు. మంగళవారం ఆలయానికి భక్తులు పోటెత్తారు. భక్తులు బోనాలతో ఊరేగింపుగా రాగా, మరికొందరు వేపచీర ధారణతో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

బంట్వారంలో కాంగ్రెస్ ఆధిక్యం

బంట్వారం, (కోట్‌పల్లి), జూన్ 4: లోకసభ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్‌కు ఊహించని విధంగా ఓట్లు వచ్చాయి. మండలంలోని తాండూర్, వికారాబాద్ నియోజవర్గంలోని 18పంచాయితీల్లో 26బూత్‌లు ఉండగా గత మే 13నా జరిగిన లోకసభ ఎన్నికల్లో 73.16శాతం ఓటింగ్ నమోదైంది. 20910ఓటర్లు ఉండగా 15298 మంది తమ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంగళవారం నాడు జరిగిన ఓట్ల లెక్కింపులో కోటపల్లి మండలం నుంచి బీఆర్ఎస్ 1016, బీజేపీ 6333, కాంగ్రెస్ 6615 ఓట్లు వచ్చాయి. కోట్‌పల్లి మండలం నుంచి కాంగ్రెస్ పార్టీకి 282 ఓట్ల ఆధిక్యాన్ని సంపాదించింది. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటింగ్ పూర్తిగా పడిపోయింది. బంట్వారం మండలంలో మొత్తం 24బూత్‌లు ఉన్నాయి. మొత్తం మండలంలో 17158 ఓటర్లు ఉండగా 12385 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించ కున్నారు, 72.17శాతం ఓటింగ్ నమోదు అయ్యింది. మంగళవారం జరిగిన ఓట్ల లెక్కింపులో బీజేపీకి 5540 ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు 5556 వచ్చాయి. బీఆర్ఎస్‌కు కేవలం 812 వచ్చాయి. దీంతో కాంగ్రెస్ మండలం మొత్తంలో 16ఓట్ల ఆధిక్యం వచ్చింది.

బీఆర్ఎస్‌కు మెజారిటీని అందించడం హర్షణీయం

దోమ, జూన్ 4: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ చేవెళ్ల అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు దోమ మండలంలోని గుండాల గ్రామంలో అధికార కాంగ్రెస్ పార్టీ కంటే 24 ఓట్లు మెజారిటీ అందించడం హర్షణీయమని పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎంతో కృషి చేసినట్లు తెలిపారు.

అంబరాన్నంటిన బీజేపీ సంబురాలు



మర్పల్లి: సంబురాల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు



తాండూరు: స్వీట్లు పంచుకుంటున్న బీజేపీ కార్యకర్తలు

వికారాబాద్/మోమిన్‌పేట్/మర్పల్లి/ధారూరు/పూడూరు/కులకచర్ల/కొడంగల్ రూరల్/బొంరాస్‌పేట్, జూన్ 4: చేవెళ్లలో బీజేపీ గెలుపు ప్రజలందరిదనీ, కార్యకర్తల కష్టంతో గెలుచుకున్నామని పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, బీజేపీ నాయకుడు వడ్ల నందు అన్నారు. మంగళవారం బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపుతో వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తాలో సంబరాలు జరుపుకున్నారు. టపాసులు కాల్చి మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివరాజు రాజేందర్‌రెడ్డి, పోకల సతీష్, సుచరిత, శిరీష, అశోక్ పాల్గొన్నారు. మోమిన్‌పేట్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలు టపాసులు పేల్చి ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. అదే విధంగా మల్కాజిగిరిలో ఈటల రాజేందర్, మహబూబ్‌నగర్‌లో డీకే.అరుణ, నిజామాబాద్‌లో ధర్మపురి అరవింద్, కరీంనగర్‌లో బండి సంజయ్‌కుమార్, ఆదిలాబాద్‌లో నగేశ్ గెలుపు పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, బీజేవైఎం అధ్యక్షుడు ఆశిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు. మర్పల్లి తహసీల్దార్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు బీజేపీ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేశ్, మండల అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి, యాదవరెడ్డి పాల్గొన్నారు. ధారూరు అంబేద్కర్ చౌరస్తాలో కార్యకర్తలు బాణసంచా కాల్చి, పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం. రమేశ్, విశ్వనాథం, రవీందర్ గౌడ్, అనిల్‌గౌడ్, జగదీశ్వర్ పాల్గొన్నారు. పూడూరు మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో నాయకులు టపాసులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. ఎంపీసీ బాలేశ్వర్ గుప్తా ఆధ్వర్యంలో నాయకులు టపాకాలు పేల్చి స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు జంగం యాదగిరి, వెంకటేశం, శేఖర్ పాల్గొన్నారు.మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే.అరుణ గెలుపు పట్ల బీజేపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం రాత్రి బొంరాస్‌పేట మండల కేంద్రంలోని భూలక్ష్మమ్మ చౌరస్తాలో టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపుతో బీజేపీ నాయకులు కులకచర్ల చౌరస్తాలో సంబరాలు జరుపుకున్నారు. బీజేపీ కార్యాలయానికి ర్యాలీ నిర్వహించి చౌరస్తాలో టపాసులు కాల్చి, స్వీట్లు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రహ్లాద్‌రావు, వెంకటయ్యగౌడ్ పాల్గొన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిపై బీజేపీ అభ్యర్థి డీకే.అరుణ గెలుపు పట్ల కొడంగల్ అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పూనంచంద్‌లాహోటీ, పట్టణ అధ్యక్షుడు సర్వేశ్వర్, మండల అధ్యక్షుడు బందెప్ప, నాయకులు బస్వరాజ్, లక్ష్మయ్యగౌడ్ తదితరులు టపాసులు పేల్చి ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. అదేవిధంగా బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని భూలక్ష్మమ్మ చౌరస్తాలో టపాసులు పేల్చి సంబురాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ శ్రావణ్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

మేడ్చల్ జిల్లాలో...

ఘట్‌కేసర్/ఘట్‌కేసర్‌రూరల్/కీసర రూరల్/మేడ్చల్ టౌన్/శామీర్‌పేట/బొంరాస్‌పేట్: మల్కాజిగిరి పార్లమెంటు బీజేపీ ఎంపీగా ఈటల రాజేందర్ గెలుపుతో ఘట్‌కేసర్ మండలంలో బీజేపీ నాయుకులు మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. 3లక్షల పైచిలుకు ఓట్లతో ఈటల రాజేందర్ గెలుపొందడం అభినందనీయమని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. అనంతరం ఈటలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చలువాది ప్రవీణ్‌రావు, శ్రీశైలం, ఏనుగు మశ్చేందర్‌రెడ్డి, సదానంద్‌రెడ్డి పాల్గొన్నారు. నాగారం ప్రధాన చౌరస్తాలో నాయకులు బాణాసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, పార్టీ అధ్యక్షుడు వేణు, కౌన్సిలర్లు బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మి, కిషోర్‌గౌడ్, రాకేష్‌గౌడ్, జూపల్లి నరేష్ పాల్గొన్నారు. మేడ్చల్‌లో బీజేపీ నేతలు పెద్దఎత్తున సంబురాలు జరుపుకున్నారు. ప్రధాన కూడళ్ల వద్దకు చేరుకుని టపాసులు కాల్చారు. మల్కాజ్‌గిరి బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు ఆధిక్యం లభిస్తున్న ప్రతీ రౌండులో అభిమానులు బ్యాండు మోగిస్తూ డాన్సులు చేశారు. ఈటలను అత్యధిక మెజారిటీతో గెలుపించిన మేడ్చల్ ప్రజలకు పార్టీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, నియోజకవర్గం కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్‌లు ధన్యవాదాలు తెలిపారు. ఈటల గెలుపుతో శామీర్‌పేట మండలంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున సంబరాలను జరుపుకున్నారు. తూంకుంట మున్సిపల్‌లోనాయకులు, కార్యకర్తలు టపాసులు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు.



శామీర్‌పేటలో టపాసులు కాల్చి విజయోత్సవంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

క్రైం కార్నర్

ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసిన వ్యక్తి మృతి

● బస్సులో 30 మందికి పైగా ప్రయాణికులు

● బస్సు డ్రైవర్‌కు స్వల్పగాయాలు



కల్వర్టులో పడిన బస్సు, బైక్

బంట్వారం(కోట్‌పల్లి) జూన్ 4: కోట్‌పల్లి నుంచి వికారాబాద్ వైపు బైక్‌పై వెళ్తుతున్న వ్యక్తి ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేయబోయి పడటంతో తీవ్రగాయాలపాలై మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని లింగంపల్లి గ్రామ సమీపంలో మంగళవారం చోటు వేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్టీసీ బస్సు కోటపల్లి నుంచి వికారాబాద్‌కు వెళ్తోంది. ఈ క్రమంలో వెనుక నుంచి బైక్‌పై వెళ్తున్న అంజయ్య బస్సును ఓవర్ టేక్ చేయబోయాడు. ఈక్రమంలో బస్సు డ్రైవర్ అప్రమత్తమై బైక్‌ను తప్పించబోయాడు. అయితే ప్రమాదవశాత్తు బస్సు పక్కనే ఉన్న కల్వర్టు పై నుంచి రోడ్డుపక్కకు దూసుకెళ్లింది. ఈ క్రమంలో బైక్‌పై ఉన్న వ్యక్తి బస్సుకింద పడి తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు దీంతో వారు అక్కడికి చేరుకుని అంజయ్యను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే మార్గమధ్యలోనే అంజయ్య ప్రాణాలు వదిలాడు. మృతుడి మామ మహేష్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు కోట్‌పల్లి ఎస్ఐ స్రవంతి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుటుంబసభ్యులకు అప్పగిస్తామని ఆమె తెలిపారు.

'ఉపాధి' పనికి వెళ్లి కూలీ..

బొంరాస్‌పేట్, జూన్ 4: ఉపాధిహామీ పనికి వెళ్లిన ఓకూలీ మృతి చెందాడు. ఈ ఘటన దుద్యాల మండల కేంద్రంలో జరిగింది. దుద్యాల గ్రామానికి చెందిన గొల్ల లక్ష్మయ్య(48) మంగళవారం ఉపాధి పనులకు వెళ్లగా ఒక్కసారిగా బీపీ లెవల్స్ పడిపోవడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. గమనించిన తోటికూలీలు చికిత్సనిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని మృతుడి కుటుంబసభ్యులు కోరారు. మృతుడికి భార్య కూతురు, కుమారుడు ఉన్నారు.

విద్యార్థిని అదృశ్యం



సంజన

ఘట్‌కసర్ రూరల్, జూన్ 4: అగ్రికల్చర్ ఫస్టియర్ చదువుతున్న ఓ విద్యార్థిని అదృశ్యమైంది. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ ఎస్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్, విజయపురి కాలనీకి చెందిన దాసోజు సంజన(18) ఘట్‌కేసర్ మండలం, అవుషాపూర్‌లోని అనురాగ్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో మొదటి సంవత్సరం చదువుతోంది. రోజూ మాదిరిగానే ఈనెల 3వ తేదీన ఉదయం 8గంటలకు ఉప్పల్‌లో కళాశాలకు చెందిన బస్సులో యూనివర్సిటీకి వచ్చింది. సాయంత్రం తిరిగి ఇంటికి రాకపోవడంతో సంజన తల్లి దాసోజు భవాని కళాశాలకు వెళ్లి విచారించింది. సంజన ఉదయం కళాశాలకు వచ్చి సాయంత్రం తిరిగి వెళ్లిపోయిందని అక్కడి సిబ్బంది సంజన తల్లికి చెప్పారు. సంజన ఫోన్ స్విచ్ఛాప్ వస్తుండటంతో తెలిసిన వారిని, మిత్రులను, బంధువులను విచారించినా ఫలితం లేకుండాపోవడంతో ఘట్‌కేసర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవులు, గేదెలు మృత్యువాత

కొడంగల్ రూరల్, జూన్ 4: విద్యుదాఘాతంతో రెండు ఆవులు, రెండు గేదెలు మృత్యువాతపడ్డాయి. ఈ ఘటన కొడంగల్ మండలంలోని సంగాయిపల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కురిసిన భారీ వర్షానికి గ్రామ శివారులో గల సంజీవరెడ్డి పొలంలో ఆదివారం విద్యుత్ స్తంభం కిందపడిపోవడంతో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. ఈ విషయంపై లైన్‌మన్‌కు సమాచారం అందించడంతో లైన్‌మన్ విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఈ క్రమంలో మంగళవారం ఆ తెగిపడిన తీగలకు విద్యుత్ సరఫరా అయిన విషయం ఎవరికీ తెలియకపోవడంతో పశువులు, గేదెల మేత కోసం వదిలిపెట్టడంతో విద్యుదాఘాతంతో ఒక్కసారిగా రెండు ఆవులు, గేదెలు మృత్యువాతపడ్డాయి. బాధిత రైతులు నర్సింహారెడ్డి, బల్వంత్‌రెడ్డి, బిచ్చిరెడ్డి, నారాయణరెడ్డిలు తమకు ప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయం అందించాలని కోరారు.

బషీరాబాద్‌లో జూనియర్ కళాశాల ప్రారంభం



జూనియర్ కళాశాలను ప్రారంభిస్తున్న శంకర్‌నాయక్, తదితరులు

బషీరాబాద్, జూన్ 4: మండల కేంద్రంలో జూనియర్ కళాశాలను ప్రారంభిస్తున్నట్లు ఇంటర్మీడియట్ నోడల్ అధికారి శంకర్‌నాయక్ తెలిపారు. బషీరాబాద్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాల(బాలురు) భవనంలో ఏర్పాటు చేయనున్న కళాశాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఇంటర్ ఫస్టియర్ కోసం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, గ్రూపుల్లో ఇంగ్లీష్, తెలుగు మీడియం, హెచ్ఈసీ తెలుగు మీడియం గ్రూపుల్లో విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఒకేషనల్ ఎంపీహెచ్‌డబ్ల్యూ గ్రూప్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మండలంలోనే జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తున్నందున ఈ అవకాశాన్ని పదో తరగతి పాసైన గ్రామీణ ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట నూతన ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి, కళాశాల అధ్యాపకులు మహేష్, అబ్దుల్ హమీద్, పాషా పాల్గొన్నారు.

టీడీపీ సంబురాలు



మిఠాయిలు పంచిపెడుతున్న టీడీపీ నాయకులు

ఘట్‌కేసర్, జూన్ 4: ఏపీలో టీడీపీ విజయం సాధించడం పట్ల ఘట్‌కేసర్ మండలంలోని ఆ పార్టీ నాయకులు ఆనందోత్సాహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఘట్‌కేసర్ ప్రధాన చౌరస్తాలో టపాసులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఘట్‌కేసర్ టౌన్‌లోని అంబేద్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు వేముల సంజీవగౌడ్, నాయకులు సామల జగన్మోహన్ రెడ్డి, కొత్త బిక్షపతిగుప్తా, తిరుపాల్, పాటి సురేందర్‌రెడ్డి, మహేష్, బొట్టు సూరి, ఉడుతల మధుబాబు, చంద్రయ్య, మడ్డి రాము, బత్తుల మహేష్, యారుకుల అశోక్‌గౌడ్, పాటి జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల విచారణ



లబ్ధిదారులతో మాట్లాడుతున్న విజిలెన్స్ డీఎఫ్‌వో రాజశేఖర్

కులకచర్ల, జూన్ 4: కులకచర్ల మండలంలోని పుట్టపహడ్, అనంతసాగర్ గ్రామాల్లో బీడీలీఫ్ (తూనికాకు) లబ్ధి దారులను వికారాబాద్ జిల్లా విజిలెన్స్ అటవీశాఖ అధికారి రాజశేఖర్ మంగళవారం విచారించారు. బీడీలీఫ్ బోనస్ డబ్బుల్లో కొందరు చేతి వాటానికి పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో విచారణ చేపట్టారు. ఖాతాలో డబ్బులు జమ అయిన లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. కానీ తాము డబ్బులు ఎవరికి ఇవ్వలేదని లబ్ధిదారులు తెలిపారు. తమ కష్టార్జితమని, ఇత అధికారులకు డబ్బులు ఎందుకు ఇవ్వాలని తెలిపారు.